శిథిల భవనాలతో భయం!

- అత్యవసర సమయంలో అక్కరకురాని తుఫాన్ షెల్టర్లు
- నిరుపయోగంగా 84 భవనాలు
- ప్రమాదకరంగా ఉన్నవి తొలగించాలని డిమాండ్


నగరంపల్లిలో శిథిలమైన తుఫాన్ భవనం

వజ్రపుకొత్తూరు:

తీరప్రాంత గ్రామాల్లో తుఫాన్ల సమయంలో తలదాచుకునేందుకు నిర్మించిన షెల్టర్లు శిథిలమై భయం గొలుపుతున్నాయి. ఉన్న భవనాలు శిథిలం కావడంతో అత్యవసర సమయంలో తలదాచుకునేందుకు షెల్టర్లు కరువైయ్యాయి. ప్రస్తుతం ఉన్న భవనాల్లోకి అడుగుపెడితే మద్యం బాటిళ్లు దర్శనమిస్తాయి. ఈ భవనాలపై పర్యవేక్షణ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా తయారువుతున్నాయి. మరో పక్క పెచ్చులూడి గోడలు బీటలువారి కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. నివాస గృహాలు, ఇతర చోట్ల ఉన్న ఈ భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. వీటి వల్ల పెను ప్రమాదాలు సంభవించక ముందే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

దిష్టి బొమ్మల్లా..

పలాస నియోజకవర్గంలోని తీర ప్రాంతంలో 35 ఏళ్ల క్రితం తుఫాన్ భవనాలను దాదాపు 90 శాతం ఊరికి దూరంగా నిర్మించారు. ప్రస్తుతం ఇవి దిష్టి బొమ్మల్లా ఉన్నాయి. వజ్రపుకొత్తూరులో 32, పలాస మండలంలో 29, మందస తీర ప్రాంత గ్రామాల్లో మరో 23 వరకు దాదాపు 6.89 కోట్లుతో వీటిని నిర్మించారు. నియోజకవర్గంలో నగరంపల్లి, వజ్రపుకొత్తూరు, సుంకరజగన్నాథపురం, మంచినీళ్లపేట, బొడ్డపాడు తదితర 84 గ్రామాల్లో పూర్తిగా శిథిలమైయ్యాయి. అలాగే ఏడేళ్ల క్రితం అమలపాడు, చినకొత్తూరు, చినవంక, అక్కుపల్లి ప్రాంతాల్లో రూ.98.67 లక్షలతో నిర్మించిన నాలుగు అధునాతన తుఫాన్ భవనాలు సైతం నిరుపయోగమై శిథిలావస్థకు చేరాయి. అమలపాడు తుఫాన్ భవనం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు.

తుఫాన్లు వస్తే పాఠశాలలే గతి

తుఫాను వస్తే ప్రస్తుతం గ్రామాల్లో ఉంటున్న పాఠశాలలే ప్రజలు ఉండటానికి గతవుతున్నాయి. 2018లో సంభవించిన తిత్లీ తుఫాన్ పలాస నియోజకవర్గాన్ని అతలాకుతలం చేసింది. ఆ సమయంలో పూరి గుడిసెల్లో ఉన్న వారంతా రోడ్డున పడ్డారు. కరెంటు, మంచినీరు, తిండీ తిప్పలకు నోచుకోలేక పోయారు. ఆ సమయంలో తుపాన్ భవనాలు నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించలేకపోయాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో తలదాచుకున్నారు. తీర ప్రాంతంలోని దాదాపు 80 పంచాయతీల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా శిథిలమైన భవనాలను కూల్చివేసి..వాటి స్థానంలో అత్యాధునిక తుఫాన్ భవనాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త భవనాలు వినియోగంలోకి తేవాలి



ఏడేళ్ల క్రితం నిర్మించిన అధునాతన సమీకృత తుపాన్ భవనాలు వినియోగంలోకి తీసుకురావాలి. స్వయంశక్తి సంఘాల కార్యకలాపాలకు, గ్రంథాలయాల నిర్వహణ, యువజన సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలకు ఇచ్చి వినియోగంలోకి తేవాలి. ఉన్న భవనాలకు మరమ్మత్తులు చేపడితే అత్యవసర సమయంలో ఉపయోగంగా ఉంటాయి.

– కారాడ గిరిబాబు, అమలపాడు

కొత్త భవనాలు నిర్మాంచాలి



శిథిలమైన భవనాల స్థానంలో విపత్తులనిర్వహణ శాఖ ఆద్వర్యంలో కొత్త భవనాలు నిర్మించి నిర్వహించాలి. అలాగే అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా ఉండేందుకు స్వచ్ఛంద, స్వయంశక్తి, యువజన సంఘాలకు ఇచ్చి నిర్వహించాలి. నగరపంల్లిలో ఉన్న భవనం పూర్తిగా శిథిలమైంది. పెచ్చులూడి భయం గొలుపుతోంది. దీన్ని తొలగించాలి.

– మామిడి గోవిందరావు, నగరంపల్లి

క్లుప్తంగా

చిన్నారుల భవిష్యత్ ఆలోచించాలి


సోంపేటలో ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో

సోంపేట: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను తల్లిదండ్రులు పరిమితికి మించి ఆటోల్లో దగ్గర ఉండి సాగనంపుతున్నారని, అయితేవారి భవిష్యత్ గురించి ఆలోచించాలని వైఎస్సార్ సీపీ నాయకులు సాడి శ్యాంప్రసాద్ రెడ్డి అన్నారు. శుక్రవారం సోంపేటలో ప్రైవేటు పాఠశాలకు పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటోను ఫొటో తీశారు. సోంపేట పోలీస్ సర్కిల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఇలాంటి ప్రయాణాలు ప్రమాదకరమన్నారు. ఇది సామాజిక బాధ్యతతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు, ఆటో యూనియన్లు, పాఠశాల యాజమాన్యాలు తప్పుగా భావించవద్దని విజ్ఞప్తి చేశారు.

ఎన్ఎఫ్‌డీపీ కార్డులు పంపిణీ


ఎన్ఎఫ్‌డీపీ కార్డులను అందజేస్తున్న నాగరాజు

వజ్రపుకొత్తూరు: మండలంలోని తీర ప్రాంతంలో ఉన్న 11 పంచాయతీల మత్స్యకారులు ఎన్ఎఫ్‌డీపీ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మత్స్య శాఖ క్షేత్రాధికారి నాగరాజు కోరారు. చినకొత్తూరు, దేవునల్తాడ తదితర గ్రామాల్లో మత్స్యకారులకు గుర్తింపు కార్డులను శుక్రవారం పంపిణీ చేశారు. వాతావరణం అనుకూలంగా లేనందున ఎవరూ వేటకు వెళ్లవద్దని సూచించారు.

సర్పంచ్ ఔదార్యం


దూదమ్మకు నగదు అందజేస్తున్న సర్పంచ్ మల్లేశ్వరరావు

వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అకురు దూదమ్మ స్వీపర్‌గా పని చేస్తున్నారు. ఈమెకు పీహెచ్‌సీ అభివృద్ధి నిధులు నుంచి నెలకు నాలుగు వేల రూపాయలను గౌరవ భృతిగా అందిస్తున్నారు. దూదమ్మ కరోనా సమయంలో కూడా సేవలు అందించారు. దీంతో ఈమెకు మరికొంత ఆర్థిక చేయూత ఇవ్వాలని అనంతగిరి పంచాయతీ సర్పంచ్ కాటకాన మల్లేశ్వరరావు సంకల్పించారు. ప్రతి నెల ఐదు వందల రూపాయలను ఇవ్వాలని భావించారు. ఈ ఏడాదికి సంబంధించి.. ఆరు వేల రూపాయలను దూదమ్మకు శుక్రవారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు. ఆస్పత్రి సిబ్బంది సర్పంచ్‌ను అభినందించారు.

ఎన్ఎస్ఎస్ పీవోగా రజనీకుమారి


రజనీకుమారి

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోగా వృక్షశాస్త్ర అధ్యాపకురాలు ఎస్.రజనీకుమారి నియామకమయ్యారు. ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ వి.శంకర్‌రావు శుక్రవారం తెలిపారు. అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రొగ్రాం సమన్వయకర్త డాక్టర్ డి.వనజ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

బీసీల అభ్యున్నతకు కృషి


మోహన్‌రెడ్డి

సంతబొమ్మాళి: బీసీ అభ్యున్నతకు తనవంతుగా కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు బుడ్డ మోహన్‌రెడ్డి అన్నారు. భావనపాడులో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని చెప్పారు. తనకు ఈ పదవి బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు, టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మత్తుకు చిత్తుకావద్దు..



మత్తు పదర్థాలకు అందరూ దూరంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. టెక్కలి మండలం కంట్రగడ గ్రామంలో గురువారం రాత్రి సంకల్పం కార్యక్రమంలో భాగంగా వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. చాలామంది యువత సెల్‌ఫోన్లకు బానిస అవుతున్నారన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తుండాలని సూచించారు. సైబర్ నేరాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. – టెక్కలి రూరల్

క్యాలెండర్ ఆవిష్కరణ..



సోంపేట పట్టణంలో శ్రీశయన చైతన్య దీపిక సంఘం ఆధ్వర్యంలో శ్రీశయన చైతన్యదీపిక 2025 సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.శివాజీ, శ్రీశయన చైతన్యదీపిక సంఘ అధ్యక్షుడు దేవాడ మోహనరావు, ప్రతినిధులు బల్ల ఆనంద్, దుద్ది వీర్రాజులు, బల్లబాబు, బీన ఆనంద్, బల్ల జానకిరావు, బల్ల బాబురావు ,బంజుల లోకనాదం, బీన ప్రదీప్ పాల్గొన్నారు. – సోంపేట

చెత్తను మరిచారు...



టెక్కలి మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం క్షీణిస్తోంది. శుక్రవారం స్థానిక నవీన్ నగర్, రేవతిపతివీధి, పాలకేంద్రం తదితర వీధుల్లో పారిశుద్ధ్య కార్మికులు సేకరించిన చెత్తను రవీంద్రభారతి స్కూల్ సమీపంలో పడేశారు. పంచాయతీకి చెందిన వాహనంలో చెత్తను వేరే ప్రాంతానికి తరలించకుండా వదిలేశారు. దీంతో ఆవులు, కుక్కలు, పందులు అక్కడకు చేరి చెల్లాచెదురు చేశాయి. ఒక్కపక్క వర్షం కురుస్తుండడంతో చెత్త నుంచి వస్తున్న దుర్వాసనతో అటుగా వెళ్తున్నవారు ఇబ్బందులకు గురయ్యారు. సంబంధిత అధికారులు స్పందించి ఏ రోజు చెత్తను అదే రోజు తరలించాలని స్థానికులు కోరుతున్నారు. – టెక్కలి రూరల్

ధాన్యం కొనుగోలుకు ముప్పతిప్పలు

- వైఎస్సార్‌సీపీ టెక్కలి ఇన్‌చార్జి పేరాడ తిలక్


మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: ఈ ఏడాది ఖరీఫ్‌లో పండించిన పంటను కొనుగోలు చేయడానికి రైతులు ఎన్నడూ లేని ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ విచారం వ్యక్తం చేశారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ధాన్యాన్ని ఎక్కడైనా కొనుగోలు చేసుకోవచ్చని కూటమి ప్రభుత్వం చేసిన ఆదేశాలు దళారీలకు కాసుల వర్షం కురిపించిందన్నారు. రైతులు మిల్లర్ల వద్దకు వెళ్తుంటే లేని పోని అవస్థలకు గురి చేస్తున్నారని, మరి కొన్ని రైస్ మిల్లుల పేర్లను ఆన్‌లైన్‌లో లేకుండా రైతులకు కాళ్లరిగేలా తిప్పుతున్నారని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రం నుంచి అమ్మకాలు చేసుకుని తక్షణమే నగదు లావాదేవీలతో రైతులు ఎంతో సంతోషంగా ఉండేవారని తిలక్ గుర్తు చేశారు. ఇప్పుడు పూర్తిగా దళారీల పక్షాన రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. పంట కోతకు వచ్చిన సమయాల్లో వరుస తుఫాన్లతో రైతులు ఇబ్బందులు పడుతుంటే కనీసం టార్పాలిన్లు అందజేయలేని నిస్సాహాయ స్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తడిసిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, టెక్కలి పీఏసీఎస్ మాజీ చైర్‌పర్సన్ సత్తారు సత్యం, నాయకులు టి.కిరణ్, ఎన్.సాబతో, కె.జీవన్, అంబోడి విష్ణు ఉన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ రవివర్మ

తీరప్రాంత ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

సోంపేట: సముద్ర తీరంలో ప్రమాదాలు జరగకుండా యువతకు అవగాహన కల్పించాలని విశాఖ కోస్టల్ సెక్యూరిటీ ఎస్పీ రవివర్మ సిబ్బందికి సూచించారు. బారువ మెరైన్ పోలీసుస్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దత్తత గ్రామాల్లో తీసుకోవలసిన జాగ్రత్తలు సిబ్బందికి వివరించారు. తీరప్రాంత ప్రమాదా పై సలహాలు, సూచనలు అందజేశారు. సీఐ రమేష్, ఎస్ఐలు ఐ.శిరీష, ఐ.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

తీర్మానం లేకుండా పనులు చేస్తారా

- టెక్కలి మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు


తీర్మానాలు లేకుండా పనులు ఎలా చేస్తున్నారని నిలదీస్తున్న వార్డు సభ్యులు

టెక్కలి: పంచాయతీ పరిపాలనా ఆమోదం, సభ్యుల తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తున్నారని పలువురు వార్డు సభ్యులు నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో చేస్తున్న వివిధ రకాల పనులకు సంబంధించి పరిపాలనా ఆమోదం, సభ్యుల తీర్మానం లేకుండా పనులు ఎలా చేస్తున్నారని వార్డు సభ్యులు పి.రమణబాబు, డి.ధర్మారావు, ఎ.రవి, ఎన్.సోమేష్, వి.అశోక్, టి.లోకేష్, కె.తిరుమల తదితరులు నిలదీశారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ జి.సుజాత, వైస్ సర్పంచ్ జి.విశ్వశాంతిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పంచాయతీ పరిధిలో చేస్తున్న వివిధ రకాల పనులపై వార్డు సభ్యుల తీర్మానం లేకపోవడంపై ఈవో జగన్నాథాన్ని నిలదీశారు. పంచాయతీకి సంబంధించి వివిధ రకాల అంశాలపై కనీసం సమాచారం ఇవ్వకపోడమేమిటని ప్రశ్నించారు. పంచాయతీ అభివృద్ధి కోసం వేసిన కమిటీలపై వార్డు సభ్యులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడంలో ఆంతర్యమేమిటని మండిపడ్డారు. అలాగే 14వ వార్డు పరిధిలో ఇప్పటి వరకు కనీసం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించకపోవడం కేవలం పక్షపాత ధోరణి అంటూ వార్డు సభ్యుడు ధర్మారావు నిలదీశారు. తమకు తెలియకుండా చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించిన రూపొందించిన అజెండాను ఎట్టి పరిస్థితిల్లో అంగీకరించేది లేదంటూ సమావేశాన్ని బహిష్కరించారు. కొత్తగా అజెండా రూపొందించి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సభ్యులంతా పట్టుబట్టారు. సమావేశంలో వార్డు సభ్యులు ఎస్.రాజేశ్వరరావు, డి.గురివినాయుడు, పింకి ప్రధానో పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో లింగ వివక్షతపై శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక ప్రాథమిక పాఠశాలలో బాలికలకు గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. పలాస ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించి బాల్య వివాహాలతో కలగనున్న దుష్ప్రభావాలను వివరించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ ఎ.సునీత, సభ్యులు ఆర్.దీపికాకుమారి, కె.రోజా రాణి ఉన్నారు.

25న కామ్రెడ్ తాతారావు స్మారక పురస్కారం ప్రదానం

పలాస: మాకన్నపల్లి గ్రామంలో ఈ నెల 25న కామ్రెడ్ కుత్తుం తాతారావు స్మారక పురస్కార ప్రదాన కార్యక్రమాన్ని నిర్విహించనున్నారు. ఈ విషయాన్ని కవి, రచయత కుత్తుం వినోద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్దానం రచయితల సంఘం ఆధ్వర్యంలో జరుగనున్న ఈ కార్యక్రమం సందర్భంగా బొడ్డపాడు గ్రామానికి చెందిన ప్రముఖ కళాకారుడు గేదెల అప్పారావుకు పురస్కారాన్ని ప్రదానం చేస్తామన్నారు. అలాగే నిశితాసి స్వీయ కవితలు, గేయాలతో ఇటీవల విడుదల అయిన 'కవ్వం' పుస్తక పరిచయ సభతో పాటు పలువురు కవులు, గాయకులకు సత్కారావు ఉంటాయన్నారు.

గుర్తింపు ప్రతిపాదనలు అందజేయాలి : డిప్యూటీ ఈవో

టెక్కలి: టెక్కలి డివిజన్ పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు ప్రతిపాదనలను తమ కార్యాలయానికి సమర్పించాలని ఉప విద్యాశాఖాధికారి పి.విలియమ్స్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ఆ తరువాత సమర్పించిన వాటిని పరిగణలోకి స్వీకరించమని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆయా పాఠశాలల గుర్తింపును రద్దు చేస్తామన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించే తల్లిదండ్రులు తప్పని సరిగా పాఠశాల గుర్తింపు చూసుకోవాలని సూచించారు.

వసతి గృహం నిర్మాణానికి రూ. 2.30 కోట్ల మంజూరు

కాశీబుగ్గ: మందస మండలం బోగబంద పంచాయతీ గిరిజన ప్రాంతమైన డబారుసింగ్ గ్రామంలో నూతన గిరిజన విద్యార్థుల వసతి గృహం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 2.30 కోట్లు మంజూరు చేసిందని పలాస నియోజకవర్గం జనసేన సమన్వయకర్త డాక్టర్ వేగులాడ దుర్గారావు చెప్పారు. ఈ గ్రామాన్ని శుక్రవారం సందర్శించిన సందర్భంగా మాట్లాడారు. నాయకులు హరీష్‌కుమార్ శ్రీకాంత్, దిలీప్‌కుమార్ పాణిగ్రాహి, కోన కృష్ణారావు, దువ్వాడ వంశీకృష్ణ చౌదరి, నందిగాం ధర్మారావు ఉన్నారు.

13న ఉత్తరాంధ్రస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలు

కవిటి: మండలంలోని ఆర్.బైరిపురంలో జనవరి 13వ తేదీన ఉత్తరాంధ్రస్థాయి ఓపెన్ క్విజ్ పోటీలను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని బైరిపురం కల్చరల్ క్లబ్ (బీసీసీ) ప్రతినిధులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచే విజేతలకు రూ. తొమ్మిది వేలు, రూ.ఏడు వేలు, రూ.ఐదు వేలు నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను అందిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లిష్, అర్థమెటిక్, కరెంట్ ఆఫైర్స్, జనరల్ సైన్స్, సోషల్ స్టడీస్, రీజనింగ్, ర్యాపిడ్‌రౌండ్ అంశాలలో స్క్రీనింగ్ టెస్ట్ ముందుగా నిర్వహిస్తామని చెప్పారు. వయసు నిబంధన, ప్రవేశరుసుము లేదన్నారు. ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామని చెప్పారు. పదిజట్లు కంటే ఎక్కువ ఎంట్రీలు వస్తే స్క్రీనింగ్‌టెస్ట్ నిర్వహించి పదిజట్లను తుదిపోటీలకు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు 94941 65120, 94936 52151, 99664 48737 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సౌత్‌జోన్ టీ–20 విజేత ఇచ్ఛాపురం


ట్రోఫీ అందుకుంటున్న ఇచ్ఛాపురం క్రీడాకారులు

ఇచ్ఛాపురం: హైదరాబాద్‌లో జరిగిన అండర్–14 సౌత్‌జోన్ బాలుర టీ–20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఇచ్ఛాపురం క్రికెట్‌క్లబ్ (ఐసీసీ) అండర్–14 బాలురు జట్టు విజేతగా నిలిచిందని కోచ్ డి.గోపీ శుక్రవారం తెలిపారు. తొలిసారిగా తెలంగాణ రాష్ట్రం నిర్వహించిన ఈ పోటీలు హైదరాబాద్‌లోని కొంపల్లి ఫైన్‌కాబ్ క్రికెట్ గ్రౌండ్ ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు జరిగినట్టు పేర్కొన్నారు. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో 20 ఓవర్లలో ఐసీసీ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 159 పరుగులు చేయగా.. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హైదారాబాద్‌కు చెందిన ఎలైట్ క్రికెట్ క్లబ్ 108 పరుగులకు ఆలౌట్ అయిందన్నారు. నిర్వాహకులు తమ జట్టుకు ట్రోఫీని అందజేసినట్టు పేర్కొన్నారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకల షెడ్యూల్..

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గం పరిధిలో శనివారం నిర్వహించనున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల షెడ్యూల్‌ను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పిరియా విజయ శుక్రవారం వెల్లడించారు. సోంపేటలోని సత్యన్నారాయణస్వామి ఆలయంలో పూజలు, కేక్ కటింగ్, కంచిలిలో కేక్ కటింగ్, కవిటిలోని చింతామణి అమ్మవారి ఆలయంలో పూజలు, ఇచ్ఛాపురం మండలం లొద్దపుట్టిలోని పాదయాత్ర స్థూపం వద్ద కేక్ కటింగ్, ఇచ్ఛాపురంలోని స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

- వజ్రపుకొత్తూరు రూరల్/వజ్రపుకొత్తూరు: కాశీబుగ్గ ప్రగతి భవనంలో మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు సమక్షంలో జరగనున్న ఉదయం తొమ్మిదిన్నర గంటలకు జరగనున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ కోరారు.
- ఇచ్ఛాపురం: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావుపట్నాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, వైస్‌చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి తెలిపారు.
- సోంపేట: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను విజయవంతం చేయాలని ఎంపీపీ నిమ్మన దాస్ కోరారు.